
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం 27 నవంబరు 2025



ఘనంగా లక్ష్మీనరసింహదాసు జయంతి

- చిత్రపటంతో భద్రాద్రి గిరి ప్రదక్షిణ
- తూము లక్ష్మీనరసింహదాసు గ్రంథాన్ని ఆవిష్కరించిన దేవస్థానం ఈవో
- స్మారకంగా భక్తి సంగీత కార్యక్రమం

వివరాలు : 6లో



పంచాయతీ ఎన్నికలకు

పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- శాంతియుత నిర్వహణకు సహకరించాలి
- అవరోధాలు కలిగిస్తే క్రిమినల్ కేసులు
- ముగ్గురు పిల్లలున్నా పోటీ చేయొచ్చు
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాటు చేశామని, శాంతియుతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. పంచాయతీ ఎన్నికల వేళ ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. మూడు విడతల్లో ఈ ఎన్నికలు జరుగుతుండగా.. గురువారం నుంచి తొలివిడతకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకోసం సర్వం సిద్ధం చేశామన్నారు.

ఆంధ్రజ్యోతి: పంచాయతీ ఎన్నికల నిర్వాహణకు తీసుకున్న చర్యలేంటి?

కలెక్టర్: జిల్లాలో పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 20మండలాల్లో మొత్తం 571 పంచాయతీల్లో 5,214వార్డులున్నాయి. గురువారం నుంచి తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతుంది. మొదటి విడతలో 7 మండలాల్లో 192పంచాయతీలు, 1,740వార్డులు, రెండో విడతలో 6మండలాల్లో 183 పంచాయతీలు, 1,686వార్డులు, మూడో విడతలో 7మండలాలు 191పంచాయతీలు, 1,742వార్డులకు ఎన్నికలు జరుగుతాయి.

ఆంధ్రజ్యోతి: సమస్యాత్మక పంచాయతీలెన్ని గుర్తించారు? అక్కడ తీసుకుంటున్న చర్యలు?

కలెక్టర్: జిల్లాలో కొన్ని సమస్యాత్మక పంచాయతీలను గుర్తించాం. వాటిని బహిరంగంగా చెప్పం. అక్కడ పోలీసుబందోబస్తుతోపాటు సీసీ కెమేరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా (మిగతా 8వ పేజీలో)

ఖమ్మం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మూడు విడతలు గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనుండగా.. కీలకఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి మొదలవుతోంది. మొదట విడతగా ఏడు మండలాల్లోని 192 పంచాయతీ సర్పంచ్ పదవులు, 1,740వార్డుల సభ్యులకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుంది. డిసెంబరు 11న జరిగే ఎన్నికల కోసం గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. తొలివిడతలో రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, చింతకాని, ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. రెండో విడతలో ఖమ్మంరూరల్, కామేపల్లి, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలు ఉండగా.. అక్కడ 30వ తేదీ నుంచి నామినే



కొణిజర్లలో దస్త్రాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

తొలి విడతకు

నేటినుంచి నామినేషన్లు


- ఏడు మండలాల్లోని 192 పంచాయతీలు, 1,740 వార్డులకు 11న ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

షన్ల స్వీకరణ ఉంటుంది. ఇక మూడో విడతలో ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి మండలాల్లో జరగనుండగా.. డిసెంబరు 3నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీల్లో ఎస్టీలకు 166 అందులో ఎస్టీ జనరల్‌కు 91, ఎస్టీ మహిళలకు 75, ఎస్సీలకు 110, ఎస్సీ జనరల్ 62, ఎస్సీ మహిళ 48, బీసీలకు 54 రిజర్వుకాగా బీసీ జనరల్ 30, బీసీ మహిళ 24 రిజర్వ్ అయ్యాయి. 236 జనరల్‌కు కేటాయించగా వాటిలో మహిళలకు 112, జనరల్ ఓపెన్‌లో 124 కేటాయించారు. మొత్తం 7,95135 మంది ఓటు హక్కు వినియోగించుకోనుండగా 5,168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 566 మంది రిటర్నింగ్ అధికారులు, 3,442మంది పోలింగ్ అధికారులు, 4,212 మంది ఇతర పోలింగ్ అధికారులు, 15ఫ్లయింగ్ స్క్వాడ్, 15 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను నియమించారు. 20 చోట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 191 రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫిర్యాదులకు 1077 టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశారు. మొత్తం మీద పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలు కావడంతో రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలవుతున్నాయి.

భద్రాద్రి దేవస్థానంలో

పోస్టుల ప్రకంపన!

- 21 పోస్టుల భర్తీకి ప్రకటన జారీ..
- ఆస్థాన పురోహితుడి పోస్టు భర్తీని ప్రస్తావించకపోవడంపై ఆక్షేపణలు
- పంచాయతీ కోడ్ సమయంలో నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల అభ్యంతరాలు



భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో పోస్టుల భర్తీ ప్రకటన ప్రకంపనలు రేపుతోంది. సుదీర్ఘకాలం తరువాత పలు పోస్టుల భర్తీకి దేవస్థానం అధికారులు బుధవారం అధికారికంగా ప్రకటన జారీ చేశారు. మొత్తం 21పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. వాటిలో దివ్యప్రబంధ పారాయణదారు రెండు, కృష్ణ యజుర్వేద పారాయణదారు ఒకటి, రెండు అర్చక, ఏడు పరిచారక, రెండు వంటస్వాములు, రెండు సహాయ వంట స్వాములు, రెండు డోలు పోస్టులు, రెండు సన్నాయి పోస్టులున్నాయి. అయితే అభ్యర్థులు హిందూ మతస్థులై సంప్రదాయానుసారం సత్ప్రవర్తనతో ఉండాలని కోరారు. డిసెంబరు 15లోపు దేవస్థానం ఈవోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రస్తావన లేని ఆస్థాన పురోహితుడి పోస్టు

ఆలయంలో ఎంతో కీలకమైన ఆస్థాన పురోహితులు పోస్టుకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఆలయంలో ఆస్థాన పురోహితుల పోస్టు కొనసాగుతుండగా మూడేళ్ల క్రితం ఆస్థాన పురోహితుడు (మిగతా 6వ పేజీలో)



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న నూతి సత్యనారాయణ, పక్కన రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నూతనంగా డీసీసీ అధ్యక్షుడిగా నియమితుడైన నూతి సత్యనారాయణ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి తుమ్మలకు మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. అలాగే నూతిని కూడా మంత్రి తుమ్మల సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఉన్నారు.

రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుక అక్రమ తోలకాలు

- తహసీల్దార్ ఆదేశాలతో ట్రాక్టర్ల పట్టివేత
- కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ఇసుక ట్రాక్టర్ పల్టీ
- బోనకల్ మండల కేంద్రంలో ఘటన

6

ఆయిల్‌పామ్ రైతులకు శుభవార్త

- 20.01 ఓఈఆర్ ఆధారంగా ఈ ఏడాది పామాయిల్ గెలల ధర నిర్ణయం
- పంట చరిత్రలో అత్యధిక ఓఈఆర్ రాక పట్ల సర్వత్రా హర్షం

అశ్వారావుపేట/ దమ్మపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆయిల్‌పామ్ రైతులకు అతిపెద్ద శుభవార్త. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఆయిల్‌పామ్ గెలల ధర నిర్ణయ కమిటీ సమావేశంలో 20.01 ఓఈఆర్ శాతంపై ధర నిర్ణయం జరిగింది. గతేడాది 19.42 రికవరీ శాతం ఉండగా ఈ ఏడాది అత్యధికంగా 20.01 ఓఈఆర్ సాధించటం ఓ రికార్డు. అత్యధికంగా సాధించిన ఓఈఆర్ ఆధారంగానే 2025-26 ఆయిల్ ఇయర్‌లో ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలల ధరలు నిర్ణయించేందుకు కమిటీ ఆమోదం తెలపటం రైతులకు శుభవార్తగా చెప్పవచ్చు.

అయితే గతేడాది 19.42రికవరీ శాతం ఉండగా ఆ మేరకు టన్నుకు సుమారు రూ.20,200 ధర పలికింది. ఇక ఈ ఏడాది ఓఈఆర్ 20.01 సాధించిన నేపథ్యంలో ఆ ధర మరో రూ.500 పెరిగే అవకాశాలున్నాయి. అయితే ప్రతీనెల అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ఈ ధరలుంటాయి. దాంతో ఏ నెలకు ఆ నెల పామాయిల్ గెలల ధరల నిర్ణయం జరుగుతుంది. సాధారణంగా ఆయిల్‌పామ్ గెలల ధర నిర్ణయంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నూనె ఉత్పత్తి కర్మాగారాలలో వచ్చిన ఆయిల్ రికవరీ శాతం ఆధారంగా ఆయిల్‌పామ్ గెలల ధర నిర్ణయించాలని గతంలో నిర్ణయం జరిగింది. కాగా హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ ఏపీసీ సురేంద్ర మోహన్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, టీఎస్ ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, పామాయిల్ రైతుల వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, బండి భాస్కర్, ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్‌పామ్ ప్రైవేటు కంపెనీలతో సమావేశం జరిగింది. ఈ ఏడాది అప్పారావుపేట, అశ్వారావుపేట ఆయిల్‌పామ్ కర్మాగారాలలో సరాసరిన 19.84 ఓఈఆర్ రాగా దమ్మపేట మండలం అప్పారావుపేట ఆయిల్ పామ్ కర్మాగారంలో ఈ ఏడాది అత్యధికంగా 20.01 ఓఈఆర్ శాతం వచ్చింది. ఈరోజు జరిగిన సమావేశంలో వీటిపై చర్చ జరిగింది. అప్పారావుపేట ఫ్యాక్టరీ వచ్చిన అత్యధిక ఓఈఆర్ 20.01 పామాయిల్ గెలల ధర నిర్ణయంపై ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు, అధికారులు పట్టుబట్టగా ప్రైవేటు యాజమాన్యాల ప్రతినిధులు రెండు ఫ్యాక్టరీలలో వచ్చిన సరాసరి ఓఈఆర్ 19.84పై ధర నిర్ణయం జరగాలంటూ పట్టుబట్టాయి. చర్చల అనంతరం ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు అత్యధికంగా వచ్చిన ఓఈఆర్‌పై ధరను చెల్లించే విధంగా కమిటీ నిర్ణయం జరగటంతో ఎట్టకేలకు రైతు సంఘం నాయకుల కృషి ఫలించింది. గతేడాది కంటే ఈ ఏడాది టన్నుకు రూ.500 పెరగుతుంది. ధర నిర్ణయంలో ప్రధానంగా ఉన్న ఓఈఆర్ 20.01 అప్పారావుపేట ఫ్యాక్టరీ సాధించటం, ఆయిల్‌పామ్ దేశ చరిత్ర అత్యధిక రికార్డుగా నమోదవటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తలమానికంగా మారింది. ఈ రికార్డు సాధించటం, దాని ఆధారంగా పామాయిల్ గెలల ధర నిర్ణయం జరిగేందుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంఘం నాయకుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఆయిల్‌ఫెడ్ అధికారుల పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయిల్‌పామ్ ధర పెరగటంతో మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపనున్నారు.



ఓఈఆర్ ధర నిర్ణయంపై ఏపీసీ సురేంద్రమోహన్‌కు లేఖ అందజేస్తున్న రైతు సంఘం నాయకుడు ఆలపాటి రామచంద్రప్రసాద్



ఓ స్లాబ్ పరిశ్రమలో మిషన్లను తొలగించిన దృశ్యం

రాయితీ సొమ్ముల కోసం..

- ఎదురుచూస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు
- రావాల్సిన మొత్తం రూ.19.48కోట్ల పైమాటే
- నష్టాల నుంచి గట్టెక్కించాలని సర్కారుకు పలుమార్లు వినతి
- హామీలిచ్చి ఆదుకోని ప్రభుత్వాలు
- పరిష్కారంలో కాలయాపన చేస్తున్నవైనం

ఖమ్మంఖానాపురంహవేలీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ వాటిపై దృష్టిపెట్టలేదని గ్రానైట్ పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన ఆర్థిక మాంద్యంలో గ్రానైట్ పరిశ్రమలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ దుర్భర పరిస్థితుల్లో సబ్సిడీలు, సీఫారమ్స్, పెరిగిన క్వారీ ఫీజులకు సంబంధించి పరిష్కారాలు చూపాలని ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ప్రభుత్వానికి మొర పెట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్.. ఖమ్మంలో పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించిన తర్వాత సమస్యలన్నీ పరిష్కరిస్తామని బీఆర్ఎస్ పెద్దలు గ్రానైట్ అసోసియేషన్‌కు హామీ ఇచ్చారు. అయితే సభ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎటూ పాలుపోని స్థితిలో యజమానులు ఉన్నారు. వీటిలో ఒక్క లీజుల ఫీజులకు సంబంధించిన పెరిగిన ధరల్లో 50శాతం తగ్గించారు. వడ్డీలపై ఎలాంటి పరిష్కారాలు చూపకుండా వదిలేశారు. కేవలం బీఆర్ఎస్ ఆవిర్భావ సభ కోసమే హామీలు ఇచ్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రానైట్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నేటికీ సబ్సిడీల విషయంలో ఎలాంటి పురోగతి లేదని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రానైట్ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోపోతే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పరిశ్రమల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు నెరవేర్చాలని వేడుకోలు

గ్రానైట్ ఫ్యాక్టరీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నారు. పలు పర్యాయాలు అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లి ప్రభుత్వ పెద్దలను కలిసిన సందర్భాల్లో పరిశ్రమను ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఖమ్మం గ్రానైట్ పరిశ్రమకు ఇన్వెస్ట్‌మెంట్ రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్స్ ట్యాక్స్ స్టాంపు డ్యూటీలపై ఇప్పటివరకు రూ.19.48కోట్ల పైచిలుకు సొమ్ములు విడుదల కావాల్సి ఉంది. ఆ ఫైళ్లన్నీ పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటికి మోక్షం కలిగించాలని గ్రానైట్ అసోసియేషన్ కోరుతోంది. ప్రభుత్వం 10నెలల క్రితం రూ.9కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించినా ఈ నిధులు నేటికీ జమ కాలేదని తెలిసింది.

పెండింగ్ 1,224 ఫైళ్లు

గ్రానైట్ రాయితీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వద్ద 1,224 పెండింగ్ ఫైళ్లున్నాయి. వాటిని పరిష్కరిస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలకు రూ.19.48కోట్ల పైచిలుకు సొమ్ము రాయితీ రూపంలో లభించి ఊరట కలుగుతుంది. పెట్టుబడి రాయితీకి సంబంధించి 25ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా రావాల్సిన రాయితీ రూ.5.33కోట్లు, పావలా వడ్డీకి సంబంధించి 483 ఫైళ్లకు రూ.7.96కోట్లు, విద్యుత్ బిల్లుకు సంబంధించి 710ఫైళ్లకు రూ.కోటి10లక్షలు, సేల్స్ ట్యాక్స్‌కు సంబంధించి 4ఫైళ్లకు రూ.4.94లక్షలు, స్టాంపు డ్యూటీ 3ఫైళ్లకు సంబంధించి రూ. 3.14లక్షలకుపైగా రాయితీలు రావాల్సి ఉంది.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం

60వ డివిజన్‌లో మంత్రి పొంగులేటి పర్యటన

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం నగర పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేటలో పర్యటించారు. ఈ క్రమంలో ఆయన రూ.కోటితో నిర్మాణం జరగనున్న సీసీ రహదారులు, డ్రైయినేజీల పనులకు శంకుస్థాపనలు చేశారు. మంత్రి పొంగులేటి వెంట ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, తదితరులున్నారు. అలాగే మంత్రి పొంగులేటి ఉదయం నుంచి సాయంత్రం వరకు వైరా, మధిర, ఖమ్మం నగరాల్లో జరిగిన పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరయ్యారు.

పార్టీలకు .. 'బీసీ' పరీక్ష!

- సవాల్‌గా మారనున్న జనరల్ స్థానాల్లో సీట్ల కేటాయింపు
- అధికార పార్టీ నేతల్లో చర్చోపచర్చలు
- ఇతర పార్టీలదీ అదే పరిస్థితి

సత్తుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సంగ్రామం ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్ద మొత్తంలో స్థానాలు కేటాయించాలన్న అంశం ఇప్పుడు అన్ని పార్టీలకు పరీక్షగా మారింది. ముఖ్యంగా పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని భావించిన అధికార పార్టీ.. మంగళవారం జరిగిన కేబినెట్‌లో 60శాతం స్థానాలను బీసీలకు కేటాయించేలా నిర్ణయించినట్టు వార్తలు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ అనధికార రిజర్వేషన్ అమలుపై క్షేత్ర స్థాయిలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కానుండటంతో ఏ మేరకు అనధికారిక రిజర్వేషన్ అమలవుతుందోనన్న చర్చ జరుగుతుండగా.. మరో వైపు అన్‌రిజర్వు గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానాలకు జనరల్ అభ్యర్థుల పోటీ పెరిగింది.

ఖమ్మం జిల్లాలో ఇలా...

ఖమ్మం జిల్లాలో 571 గ్రామ పంచాయతీలుండగా వాటిలో షెడ్యూల్ ఏరియా పంచాయతీలు మినహాయించి నాన్ షెడ్యూల్ ఏరియాలో మొత్తం 461 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో జనరల్ కేటగిరీకి 236, ఎస్సీ రిజర్వుడ్ పంచాయతీలు 110, ఎస్టీలకు 61 గ్రామ పంచాయతీలు రిజర్వు కాగా బీసీలకు 53 గ్రామపంచాయతీలు రిజర్వ్ అయ్యాయి. మొత్తం పంచాయతీల్లో అయిదు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిలిచిపోయాయి. డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ప్రకారం గత రిజర్వేషన్లనే ఖరారు చేశారు.



అధికార కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ కోసం తీవ్రంగా కృషి చేసింది. అన్ని పార్టీలు బీసీ రిజర్వేషన్ కోసం మద్దతిచ్చాయి. కానీ ఈ అంశం కోర్టులో ఉండటంతో అధికారికంగా రిజర్వేషన్ అమలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పాత రిజర్వేషన్ల మేరకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ పరంగా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది.

స్థానిక నాయకులకు సవాలుగా...

గ్రామ పంచాయతీల్లో పార్టీ రహితంగా ఎన్నికలు జరుగుతున్నా ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను (మిగతా 6వ పేజీలో)

ఘనంగా లక్ష్మీనరసింహదాసు జయంతి

చిత్రపటంతో గిరి ప్రదక్షిణ
తూము లక్ష్మీనరసింహదాసు గ్రంథాన్ని ఆవిష్కరించిన ఈవో
స్మారకంగా భక్తి సంగీత కార్యక్రమం

భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాజా తూము లక్ష్మీనరసింహదాసు 235వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తూము లక్ష్మీనరసింహదాసు చిత్రపటంతో మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ క్రమంలో విస్తా కాంప్లెక్సు వద్ద తూము లక్ష్మీనరసింహదాసు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్త రామదాసు, తానీషా, పోకల దమ్మక్క విగ్రహాల వద్ద సైతం పూజలు చేశారు. గిరి ప్రదక్షణ అనంతరం రామాలయంకు చేరుకున్నారు. తూము లక్ష్మీనరసింహదాసు పేరిట భద్రాద్రి రామయ్యకు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తూము లక్ష్మీనరసింహదాసు చిత్రపటంతో దేవస్థానం ఈవో, సిబ్బంది


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో

గ్రంథంను ఆవిష్కరించిన ఈవో

భద్రాచలం దేవస్థానం రామాయణ పారాయనదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన శ్రీ రాజా తూము లక్ష్మీనరసింహ దాసు చరిత్ర గ్రంథాన్ని ఆలయ ఈవో కె.దామోదర్‌రావు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో గ్రంథ రచయిత ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, తూము నరసింహదాసు వంశీకులు పాల్గొన్నారు. సాయంత్రం చిత్రకూట మండప ప్రాంగణంలో సంకీర్తన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మహేంద్ర కోలాట బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు. భద్రాచలంకు చెందిన వనం శ్రీముఖి రఘుమై బృందం, నల్లాచక్రవర్తుల జయశ్రీ, లాస్యశీల నృత్య ప్రదర్శన చేయగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే తూము మంజరి, శ్యామల నరసింహదాసు కీర్తనలను ఆలపించారు. ఈకార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాలసాయిబాబా, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజారంజక పాలన

ప్రతిపక్షాలవి అనవసర మాటలు
మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్


మాట్లాడుతున్న ఎంపీ బలరామ్ నాయక్

మణుగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని శాఖల విభాగాల నుంచి అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సదుపాయాలను కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చక్కని పాలనను సాగిస్తున్నారని మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్ తెలిపారు. బుధవారం మణుగూరులో పర్యటించిన ఆయన సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు వెంటనే బోనస్ ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతిపక్ష నాయకులు అనవసర మాటలు మాట్లాడుతున్నారు. మాట్లాడకండి ఓపిక చేసి చూడండి సీఎం రేవంత్ ఇందిరమ్మ రాజ్యం చూపెడతారన్నారు. విద్యారంగం అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దాదాపు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రజా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతుబంధు, రైతు రుణమాఫీ, రైతులకు పంట బోనస్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు పోడు భూములకు పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. తనహయంలో ఈ నియోజవకర్గంలో మారు మూల ప్రాంతాలకు ప్రధాన రహదారుల ఏర్పాట్లు జరిగాయన్నారు. భద్రాచలం రెండో బ్రిడ్జి కూడా తన హయంలోనే మంజూరుచేసి నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. మోడికుంట కూడా టెండర్ పనులు పూర్తి అయ్యాయి. పెద్ద పెద్ద ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఐటీసీ అధికారులు సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాలకు వాడాలని కోరారు. పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ బలరామ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, పోలమూరి రాజు, బానోత్ లక్ష్మన్, యూత్ కాంగ్రెస్ నాయకులు కూరం రవి, ఎండీ రహీం బాషా, ఎన్ఎస్‌యూఐ ఆరీఫ్, ఐఎన్‌టీయూసీ నాయకులు వెలగపల్లి జాన్, నాగరాజు, వాసంశెట్టి వెంకట్రావ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కర్మలకు వెళ్లివస్తూ కానరాని లోకాలకు..

అనంతోగు- ముత్తాపురం మధ్య కారు, బైక్ ఢీ
ద్విచక్రవాహనంపై వచ్చే వ్యక్తి మృతి

ఆళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై కర్మలకు వెళ్లివస్తు, కారు ఢీ కొని కానరానిలోకాలకు వెళ్లాడు ఆళ్లపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలం, పెద్దవెంకటాపురం గ్రామానికి చెందిన జార రమేష్(35) స్వగ్రామం టేకులపల్లి మండలం, కొప్పురాయి గ్రామం ఐనప్పటికి సుమారు పదేళ్ల క్రితం నుంచి అత్తగారు గ్రామమైన పెద్దవెంకటాపూరంలో వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. కాగా బుధవారం కొప్పురాయిలో తెలిసిన బంధువుల ఇంట్లో కర్మలు ఉండటంతో బైక్‌పై వెళ్లి, ముగించుకుని తిరిగి సాయంత్రం పెద్దవెంకటాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో ఆళ్లపల్లి నుంచి కొత్తగూడెం వెలుతున్న టీఎస్ 27,ఈ5508 గల కారు, అనంతోగు-ముత్తాపురం మధ్య ఎదురుగా వస్తున్న రమేష్ బైక్‌ను ఢీ కొనడంతో, కారు రమేష్ తలకు బలంగా తల గలడంతో, తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కారులో ఉన్న వ్యక్తుల వివరాలు తెలియరాలేదు. ఆళ్లపల్లి ఎస్‌ఐ సోమేశ్వర్ కేసు నమోదు చేసి పూర్తి వివరాలపై దర్యప్తు చేస్తున్నారు.

ఏసీబీ పేరుతో సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు

బెంబేలెత్తుతున్న అధికారులు

ఇల్లెందుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) ఇల్లెందులోని రెండు ప్రధాన కార్యాలయ అధికారులపై దృష్టి పెట్టిందంటూ కొంతమంది సామాజిక మాధ్యమాలల్లో మెస్సేజ్‌లు ట్రోల్ చేయడంతో అధికారులు బెంబెలేత్తుతున్నారు. ఇల్లెందులో ఇటీవల సివిల్ సప్లయ్ డీటీని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈఘటన జరిగిన అనంతరం గత రెండు రోజులుగా ఇల్లెందులోని మునిసిపల్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం అధికారులపై ఏసీబీ దృష్టి పెట్టిందంటూ సోషల్ మీడియాలో మెస్సేజ్‌లు రావడంతో అధికారుల్లో భయాందోళనలతో పాటు సంచలనం కల్గించింది. చడీచప్పుడు కాకుండా దాడులు నిర్వహించే ఏసీబీ అధికారులు దృష్టిపెడితే కొంతమందికి ఈ సమాచారం ఎలా తెలుస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం అధికారుల వద్ద పనులు కావడం లేదనే కారణంతోనే తప్పుడు మెస్సేజ్‌లతో భయందోళనలకు గురిచేస్తున్నారని ఉద్యోగులు సైతం పేర్కొంటున్నారు. వాట్సాప్‌ల్లో ఇలా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం కొంతమందికి అలవాటుగా మారిందని అధికారులు, రాజకీయపార్టీల నేతలు పేర్కొనడం గమనార్హం.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తోలకాలు

తహసీల్దార్ ఆదేశాలతో ట్రాక్టర్ల పట్టివేత
కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ పల్టీ
ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న కారుకు తప్పిన ప్రమాదం


ఇసుక ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో దెబ్బతిన్న కారు

బోనకల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ తోలకాలు గత కొన్నాళ్లుగా రాత్రింబవళ్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందానా వీరి అక్రమ తోలకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇందిరమ్మ ఇళ్ల కూపన్ల పేరుతో ఇసుకను ట్రక్కుల కొద్దీ తరలిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్దగల వైరా ఏటి నుంచి బుధవారం 3 ట్రాక్టర్లు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండటాన్ని తహసీల్దార్ ఎం.రమాదేవి చూశారు. వెంటనే ఇసుక రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలను చూడమని సిబ్బందిని ఆదేశించారు. వారు మధిర క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లి ఇసుక ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఒక ట్రాక్టర్ తోలకదారుడు ఉడాయించగా మరొకటి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మూడవ ట్రాక్టర్‌ను ఆర్వీబీ మీదుగా బోనకల్ తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా యూటర్న్ తీసుకునే క్రమంలో పల్టీ కొట్టింది. ఆ సమయంలో ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న కారు అంచుపై ఇసుక ట్రక్కుపడింది. దీంతో కారు డ్రైవింగ్ వైపు దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న టీచర్లంతా భయాందోళనకు లోనయ్యారు. పూర్తిగా ట్రక్కు కారుపై పడిఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. కారు యజమాని పి.రామారావు జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లకు రక్షణగా వస్తున్న కొందరి ద్విచక్ర వాహనాలపై ఓ నియోజకవర్గ ప్రజా ప్రతినిధి తాలుకా అని రాసుకోని తిరుగుతున్నట్లు ప్రజలు ఆసక్తిగా చర్చిస్తున్నారు. ఆంధ్రా నుంచి కూడా రాత్రివేళల్లో అక్రమ ఇసుక తోలకాలు చిరునోముల, చొప్పకట్లపాలెం, గోవిందాపురం(ఎ) గ్రామాల మీదుగా జోరుగా సాగుతున్నాయన్న చర్చ జరుగుతుంది. అక్రమ తోలకాలకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కబెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక తోలకాలకు కళ్లెం వేయాలని, పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులపై ప్రభుత్వం వివక్ష

రైతుదీక్షలో బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మార్కెట్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే రైతులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద రైతుదీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు మద్దతు ధర దక్కక, దిగుబడి రాక, ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ సర్కార్ కూడా రైతుల ఉసురు తగిలి ప్రభుత్వం కుప్పకూలిందని, ఇప్పుడు అదే విధంగా కాంగ్రెస్ తప్పుచేస్తూ పతనానికి బాటలు వేసుకుంటుందని జోస్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఆహనా పెళ్ళంట సినిమా తరహాలో ఉందని ఆ సినిమాలో పిసినారి పాత్రదారుడు కోట శ్రీనివాసరావు తాడుతో కట్టేసిన కోడిని చూపిస్తూ ప్లేట్‌లో అన్నం తినేట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకుండా, మొత్తం రుణమాఫీ చేయకుండా, ధాన్యానికి బోనస్, పంట నష్ట పరిహారం, పత్తి కొనుగోలులో ఇబ్బందులు.. ఇలా అన్ని రకాలుగా రైతులను నట్టేట ముంచుతుందని వాపోయారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడించి వారు పడుతున్న కష్టాలను వివరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, చిలివేరు రమేష్, మందడపు సుబ్బారావు, నున్నా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఆదివాసీ విద్యార్థినికి అంతర్జాతీయ గుర్తింపు

తానా బాల రచయితల సమ్మేళనానికి అవకాశం



భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని మడివి గురుత్వా సమందా సింగ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 30న వర్చువల్ విధానంలో జరిగే బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఆమెకు ఆహ్వానం అందింది. కథ, వచన కవిత్వం, గేయం, పద్యం విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 101మంది తెలుగు విద్యార్థులు పాల్గొంటుండగా.. భద్రాచలం యజ్ఞజా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మడివి గురుత్వ సమందా సింగ్ కథ విభాగంలో ఎంపికైంది. ఆమె మూడు నిమిషాల పాటు కథ వినిపించనుంది. వివిధ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థి ఎంపిక అవడం పట్ల కరస్పాండెంట్ ఉషారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, డాక్టర్ తోటకూర ప్రసాద్, చిగురుమళ్ల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పార్టీలకు .. 'బీసీ' పరీక్ష!

(5వ పేజీ తరువాయి)

ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేయడం సాధారణ విషయం. కానీ అధికార పార్టీ అనధికార బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించటంతో ఇది క్షేత్ర స్థాయిలో ఏ మేరకు అమలుకు నోచుకుంటుందోనని అధికార పార్టీ నాయకుల్లో చర్చగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా జీవో జారీ చేయటం ఆ మేరకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయగా కోర్టు కేసు కారణంగా అప్పట్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో బీసీ వర్గాలకు న్యాయం చేసే దిశగా కాంగ్రెస్ నాయకులు అనధికారిక రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయం తీసుకోవటంతో ఇతర పార్టీలు కూడా బీసీలకు పెద్ద సంఖ్యలో స్థానాలు కేటాయిస్తామని ప్రకటించాయి. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులకు ఇది సవాలుగా మారింది. పార్టీ పరంగా బీసీ రిజర్వేషన్ అమలు చేస్తే జనరల్ స్థానాలనే బీసీలకు కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. సాధారణంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాంగ్రెస్ నాయకులు తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. అధికారపార్టీ బీసీ అభ్యర్థులను రంగంలోకి దించిన చోట విపక్ష పార్టీలు కూడా కొంత ఇబ్బందికర పరిస్థితే. అటు అధికార, విపక్ష పార్టీలకు అనధికారిక రిజర్వేషన్లు సవాల్‌గా మారబోతోంది.

జనరల్ స్థానాల్లో పోటాపోటీ....

అన్‌రిజర్వుడు గ్రామ పంచాయతీల్లో పోటీ చేసేందుకు జనరల్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో సిద్ధమవుతున్నారు. అన్‌రిజర్వుగా ఉన్న ఒక్కో గ్రామ పంచాయతీలో అధికార పార్టీ నుంచి ఇద్దరు నుంచి నలుగురు స్థానికంగా జనరల్ కేటగిరీ నాయకులు పోటీకి సై అంటున్నారు. వీరిని ఎలా బుజ్జగించి దీటైన అభ్యర్థిని ఎలా ఎంపిక చేయాలి? మిగిలిన వారిని ఎలా ఒప్పించాలి? అని అధికార పార్టీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్న క్రమంలో అనధికారిక బీసీ రిజర్వేషన్ అంశం అధికార పార్టీ నాయకులు తెరపైకి తేవటంతో ఆయా వర్గాల నుంచి కూడా నియోజకవర్గ నాయకులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచులుగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పార్టీకి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. మరో వైపు అధికార పార్టీపై ఉన్న ఒత్తిడితో పోలిస్తే విపక్ష పార్టీలపై అంతగా ఒత్తిడి కనిపించడం లేదు. అధికార పార్టీకి దీటుగా అభ్యర్థులను పోటీకి పెట్టాలని విపక్షంగా భావిస్తున్నా గెలిచే సత్తా ఉన్న అభ్యర్థుల కోసం విపక్షం గాలిస్తోంది. అధికార పార్టీ బీసీ రిజర్వేషన్ అమలు చేస్తే ఆ పార్టీలో జనరల్ ఆశావహుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ నిర్ణయం మేరకు పెద్ద సంఖ్యలో బీసీ అభ్యర్థులను ఎంపిక చేయకపోతే దాని ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో అభ్యర్థిత్వం కోసం ఆశించి భంగపడిన జనరల్ ఆశావహులు కూడా బరిలో ఉండే పరిస్థితులూ ఉన్నాయి. పార్టీ నిర్ణయాన్ని కాదని వారు ఎన్నికల్లో పోటీ చేస్తే విపక్ష పార్టీలు అనుకూలంగా మార్చుకునే అవకాశాలుండటంతో అధికార పార్టీ ఆచితూచి అడుగులేస్తోంది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్‌కు న్యాయశ్రీ అవార్డు



ఖమ్మం లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ లా డే పురస్కరించుకొని మెగాసిటీ నవకళా వేదిక, ట్రిబుల్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కోర్టులో గల నాలుగున్నర సంవత్సరాలుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందిస్తున్న శంకర్ కు న్యాయ శ్రీ అవార్డును హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ గౌస్ మీరా మోహినుద్దీన్ చేతుల మీదుగా న్యాయశ్రీ అవార్డు బహూకరించారు. దైవజ్ఞ శర్మ ఘనంగా సన్మానించారు.

భద్రాద్రి దేవస్థానంలో పోస్టుల ప్రకంపన!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంటోందని బ్రాహ్మణ సంఘాలు, పలువురు పురోహితులు పేర్కొంటున్నారు. వశిష్టస్థానంగా పరిగణించే ఆ పోస్టులో ఉన్న వారుసుప్రభాత సేవ సమయంలో పంచాంగ శ్రవణంతో పాటు ఆలయంలో జరిగే ఉత్సవాలను నిర్ణయించేవారని పేర్కొంటున్నారు. వైదికపరమైన నిర్ణయాల్లో ఎంతో కీలకంగా ఆస్థాన పురోహితులు వ్యవహరించేవారని గుర్తు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పోస్టు గురించి దేవస్థానం అధికారులు నూతనంగా వచ్చిన కీలక అధికారి దృష్టికి తేకపోవడం సమంజసం కాదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అలాగే ఆలయంలో దర్బారు సేవ ఎంతో ప్రఖ్యాతి గాంచింది. ఆ సమయంలో హరిదాసులు భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తారు. అయితే గతంలో హరిదాసులుగా బాధ్యతలు నిర్వహించిన వీరారెడ్డి అనంతరం ఆ పోస్టును భర్తీ చేయలేదని రామ భక్తులు పేర్కొంటున్నారు. ఇటీవల సైతం దర్బారు సేవ సమయంలో హరిదాసులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో లోపాలు తలెత్తిన విషయం సైతం తెలిసిందే. అదేవిధంగా మృదంగ పోస్టును సైతం భర్తీ చేయాల్సిన అవసరం ఉన్నా అధికారులు ఆ పోస్టు భర్తీపై ఎందుకు ఆసక్తి చూపలేదో తెలియడం లేదన్న చర్చ జరుగుతోంది.

కోడ్ నేపథ్యంలో నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన క్రమంలో కోడ్ అమల్లో ఉన్న సమయంలో పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేయడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే దేవస్థానం అధికార వర్గాలు మాత్రం కేవలం తాము దరఖాస్తులు మాత్రమే ఆహ్వానిస్తున్నామని, తుది నిర్ణయం తీసుకోవడం లేదని స్పష్టం చేస్తున్నారు. అలాగే తీసుకున్న దరఖాస్తులను దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి నివేదించనున్నామని, వారి మార్గదర్శకాలకు అనుగుణంగా తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.

జిల్లా స్థాయి 'ఖోఖో' విజేతల ఎంపిక


బహుమతులు అందుకుంటున్న బాల క్రీడాకారులు

కల్లూరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో బుధవారం మినీ క్రీడా స్టేడియంలో ఎజీఎఫ్ అండర్ 14 బాల, బాలికల విభాగం జిల్లా స్థాయి ఖోఖో క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో జిల్లా నుంచి 22 మండలాల నుంచి 500 మంది క్రీడాకారులు తరలి వచ్చారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచన వారిలో రాష్ట్ర స్థాయి ఖోఖో బాల, బాలిక జట్లకు ఎంపిక చేశారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతర్థ స్థానాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. వారికి గాను ఎస్‌జిఎఫ్ తరుపున షీల్డ్, మెరిట్ పత్రాలను అందించారు. ఇంకాను ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఖోఖో జట్లను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వికారాబాద్‌లో జరిగేటటువంటి క్రీడా పోటీలకు పంపటం జరగుతుందని ఎస్‌జిఎఫ్ క్రీడల ఇన్‌చార్జి పసుపులేటి వీరరాఘవయ్య తెలిపారు. ఈ క్రీడల నిర్వహణలో ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి వై రామారావు, క్రీడల కన్వీనర్ పత్తిపాటి నివేదిత, టోర్నమెంట్ ఆర్గనైజర్ బోడా భీమా, ఖమ్మం భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, సెలక్షన్ మెంబర్స్ పి నరసయ్య, నక్క వెంకటేశ్వర్లు, రమాదేవి, పి కవిత, రామారావు, పవన్‌కుమార్, పాల్గొన్నారు.

నిరాహారదీక్షను జయప్రదం చేయండి


కరపత్రం ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఏన్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఈనెల 27, 28తేదీల్లో ఖమ్మంలో జరిగే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బి.గోపి కోరారు. బుధవారం ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వాసవిదేవి, సంఘం నాయకులు కడియాల కిరణ్, శ్రీలత, శ్యామల, కస్తూరి, మాధవి సులోచన, నరసింహారావు, శంకరరావు, రాఘవరావు, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుతో..ముసుగు పడింది


లింగాలలో ప్రధాన రహదారిపై ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో వెనువెంటనే మండల స్థాయి ప్రభుత్వ అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నారు. బుధవారం ఉదయం పలు గ్రామ పంచాయితీల్లో గల రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు ధరించే కార్యక్రమం నిర్వహించినట్లు మండల పరిషత్ అధికారి డి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయితీల కార్యదర్శిలకు, సిబ్బందికి ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి, లింగాల, చెన్నూరు, పేరువంచ, చంద్రుపట్ల, బత్తులపల్లి, యజ్ఞనారయణపురం, ఎర్రబోయనపల్లి తదితర గ్రామాల్లో గల విగ్రహాలకు పంచాయితీల కార్యదర్శుల పర్యవేక్షణలో సిబ్బంది విగ్రహాలకు ముసుగులు ధరించారు. ఇలా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని మండల పరిషత్ అధికారి తెలిపారు.

వరికొయ్యలు కాల్చొద్దు.. భూసారాన్ని పాడు చేయొద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లోని వరికొయ్యలను కాల్చి భూసారాన్ని పాడు చేయవద్దని వైరా ఏడీఏ తుమ్మల కరుణశ్రీ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏవో మయాన్ మంజూఖాన్‌తో కలిసి ఏడీఏ కరుణశ్రీ పర్యటించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చటం వలన జరిగే నష్టాలను, భూమిలో కలియదున్నడం వలన కలిగే ప్రయోజనాలను ఆమె రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కీర్తి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలు ఇలా..

ఉల్లంఘిస్తే కేసులు తప్పవు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ సమరాంగణం మొదలయ్యింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని మంగళవారం గ్రామపంచాయతీల నగరాను మోగించారు. నోటిఫికేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. మంగళవారం నుంచే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే కార్యక్రమాలు చేపట్టకూడదు. ప్రభుత్వం కూడా ఓటర్లను ఆకర్షించే ఏలాంటి నిర్ణయాలు తీసుకోకూడదన్న నిబంధనలు ఉన్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టర్ క్షేత్ర స్థాయి అధికారులకు సమాచారాన్ని అందించారు. ఎన్నికల కోడ్‌ను విధిగా పార్టీలు, ప్రజాప్రతినిధులు పాటించాల్సి ఉంటుంది. కోడ్‌ను ఉల్లంగిస్తే కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఫ్లెక్సీలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఫ్లెక్సీలను, చిత్రాలను తొలగించారు.



ఎన్నికల కోడ్ నియమావళి ఇదీ..

- షెడ్యూల్ విడుదలైన తర్వాత మంత్రులు, ఇతర వ్యవస్థలు ప్రభావితంచేసే నిర్ణయాలు తీసుకోవద్దు.
- శంకుస్థాపనలను ప్రారంభోత్సవాలు చేయకూడదు.
- పథకాలు, ప్రాజెక్టులు కార్యక్రమాలు ప్రకటించకూడదు.
- నిధులు విడుదల చేస్తామని వాగ్దానాలు చేయరాదు.
- కొత్తగా నిధులు విడుదల చేయకూడదు.
- ప్రభుత్వ పరంగా ఏలాంటి బదిలీలు చేపట్టకూడదు.
- నిబంధనల ప్రకారమే ప్రచారాలు నిర్వహించాల్సి ఉంటుంది. స్థానిక అధికారుల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదు. అనుమతితో లౌడ్‌స్పీకర్లను ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలి.
- కులాలు, మతాల మధ్య, వ్యక్తుల మధ్య విభేదాలు, ద్వేషాలకు దారితీసే విధంగా ప్రవర్తించకూడదు.
- రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థల ఆవరణంలో ఎలాంటి సమావేశాలు నిర్వహించ వద్దు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా మందిరాలను ప్రచారవేదికలుగా వినియోగించవద్దు.
- ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రచార కరపత్రాలు కానీ ప్రకటనలు కానీ జారీచేయవద్దు.
- పోలింగ్ కేంద్రాల్లోకి మంత్రులు వెళ్లకూడదు.
- కేంద్ర రాష్ట్ర మంత్రులు ఓటు వేసేందుకు వారిపోలింగ్ కేంద్రానికి తప్ప ఇతరపోలింగ్ కేంద్రాలకు వెళ్లరాదు.
- మంత్రులు,ప్రజాప్రతినిధులు ఏదైనా ప్రాంతంలో పర్యటిస్తే ప్రభుత్వ వాహనాలను వినియోగించవద్దు. వారివెంట భద్రతా సిబ్బంది మినహా మిగిలిన ప్రభుత్వ అధికారులు పాల్గొన వద్దు.
- మంత్రులు గన్‌మెన్లు భద్రత ఉన్న ఎవ్వరూ పోలింగ్ ఏజెంట్లుగా, కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండవద్దు.
- పోలింగ్ కేంద్రానికి ఓటర్లను అభ్యర్థుల వాహనాల్లో తరలించ వద్దు.
- కేంద్రం లోపల బయట అధికారులతో వాగ్వాదానికి దిగకూడదు.
- ఒక అభ్యర్థి ఏర్పాటుచేసిన ప్రచార సామాగ్రిని మరో అభ్యర్థి తొలగించ వద్దు.
- ఎన్నికల సమావేశం నిర్వహించేందుకు మైదానాల వంటి సార్వజనీత ప్రదేశాలను, హెలిప్యాడ్ల వాడకంలో అధికార పార్టీ గుత్తాధిపత్యం చూపరాదు.
- ఎయిడెడ్ విద్యాసంస్థ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏదైనా ఎయిడెడ్ పొందుతున్న ఇతరవిద్యాసంస్థ మేనేజ్‌మెంట్‌కు ఇన్‌చార్జిగాఉన్నా, ఆసంస్థతో సంబంధం ఉన్న అభ్యర్థి ఎన్నిక ల పోటీలో నిలిస్తే ఆ సంస్థకు చెందినభవనాలు, వాహనాలు మౌళిక సదుపాయాలు, సిబ్బందిని వినియోగించరాదు.
- ఎన్నికల సమయంలో నిర్వహించే ప్రతి సమావేశాన్ని ఎన్నికల సమావేశంగానే పరిగణించాలి. వాటిపై ప్రభుత్వ సొమ్ము ను ఖర్చుచేయవద్దు.
- ప్రభుత్వ ఉద్యోగులు అలాంటి సమావేశాలకు హాజరు కారాదు.
- అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఓటర్లను ఆకర్షించగలిగేప్రభావం చూపేలా ప్రభుత్వంలోనూ ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ అడ్హక్ నియమాలు చేయరాదు.
- రోడ్ల నిర్మాణం తాగు నీటి సౌకర్యం కల్పన వంటి హామీలు ఇవ్వవద్దు.
- ఎన్నికల కాల పరిమితిలో ప్రభుత్వ ఖజానా ఖర్చుతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పత్రికలు టీవీలో ప్రకటలను జారీ చేయవద్దు.

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే..

అభ్యర్థుల అర్హతలు...

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని స్థానిక పరిపాలన గ్రామస్వరాజ్యం పరిఢవిల్లాలని జాతిపిత మహాత్మా గాంధీ ఆశించారు. గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలని స్థానిక పరిపాలనలో సమున్నత అధికారాలు ఉండాలని మేధావులుచెబుతున్నారు. 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు విశేష అధికారాలు వచ్చాయి. కానీ వాటిని మన పాలకులు స్థానిక సంస్థలకు అందకుండా తొక్కిపెడుతున్నారు. అప్పుడప్పుడు నిధులు విదిల్చుతున్నారు. గ్రామాల్లో పంచాయతీ సర్పంచి పదవి అంటే అదొక హోదా. దీనికి పోటీ కూడా అధికంగానే ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పోరు అనివార్యం కానుంది.

అభ్యర్థుల అర్హతలు గురించి ఎన్నికల సంఘం సూచనలు

- నామినేషన్ల పరిశీలన సమయానికి గ్రామ పంచాయతీ సర్పంచి వార్డు సభ్యునిగా పోటీ చేయాలంటే 21ఏళ్లు నిండి ఉండాలి
- పంచాయతీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదైఉండాలి.
- వార్డు సభ్యునిగా పోటీ చేసే వ్యక్తి పంచాయతీ పరిధిలో ఓటరైఉండాలి. పోటీ చేయదల్చిన వార్డులో ఓటరు కానప్పుడు ఆ వార్డుకు చెందిన ఓటరు ఒకరు ప్రతిపాదించాలి. మరో ఓటరు బలపరచాల్సి ఉంటుంది.
- మతిస్థిమితం లేని వారు. చెవిటి, మూగవారు కుష్టు రోగులు పోటీచేయడానికి అనర్హులు. దివాళా దరఖాస్తు చేసిన వారు , అప్పుచెల్లించని వారుగా న్యాయస్థానం తీర్పు ఇచ్చిన వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.
- గ్రామపంచాయతీ ,మండలపరిషత్, జిల్లా పరిషత్ సహ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంతో పనులు చేసేందుకు ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు పోటీచేయరాదు.
- గతంలో ఇద్దరు మించి పిల్లలు కలిగిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించినా ఈ సారి ఆ నిబంధనను సడలించారు. .
- క్రిమినల్ కేసుల్లో శిక్ష అనుభవించే వారు.శిక్ష పూర్తయిన తర్వాత ఐదేళ్ల కాలం వరకు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.
- గ్రామపంచాయతీకి పన్ను బకాయిలు చెల్లించని వారు పోటీకి అనర్హులు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ,ఏదైనా స్థానిక సంస్థ అధికార వర్గం కింద ఉద్యోగం చేస్తున్న వ్యక్తి అవినీతికి పాల్పడి సస్పెండ్ అయినప్పుడు స్థానిక అధికార వర్గానికి అవిశ్వాసంగా ఉంటూ తొలగించిన వ్యక్తి తొలగింపు తేదీ నుంచి ఐదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.
- గ్రామ సేవకుడు (వీఆర్ఏ), సహా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగి ప్రభుత్వ నిధుల నుంచి సహాయం పొందే ఏదైనా సంస్థకు చెందిన ఉద్యోగి ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

మీకిది తెలుసా..!

పంచాయతీలు ఎలా ఏర్పడ్డాయంటే....!

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలు.. ఎలా పుట్టాయో తెలుసా మీకు..? మన దేశంలో ఆంగ్లేయుల పాలనలో గవర్నర్‌గా కారన్ వాలిస్ ఉన్నప్పుడు లాటరీ విధానంలోని పంచాయతీ వ్యవస్థను రద్దు చేశారు. 1884లో లార్డ్ రిప్పన్ రాజప్రతినిధిగా వచ్చిన తరువాత రద్దు చేసిన పంచాయతీ వ్యవస్థను కొత్త హంగులతో పునరుద్ధరించారు. అప్పటి నుంచి బ్యాలెట్ ఎన్నిక విధానానికి శ్రీకారం చుట్టారు. అందుకే లార్డ్ రిప్పన్‌ను స్థానిక సంస్థల పితామహుడిగా అభివర్ణిస్తుంటారు. ఈ పంచాయతీ చట్టం 1964లో అమల్లోకి వచ్చింది. అంతకుముందు మద్రాసు గ్రామ పంచాయతీ చట్టం-1950 (ఆంధ్రా ప్రాంతంలో), హైదరాబాద్ గ్రామ పంచాయతీ చట్టం-1956 (తెలంగాణ ప్రాంతంలో) అమల్లో ఉండేది. 1959లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు వేర్వేరుగా ఉన్న పంచాయతీ చట్టాలను రద్దుచేసి రెండింటినీ క్రోడీకరించి 1964లో ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టాన్ని చేశారు. 1964లో రాష్ట్రం అంతటా ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత 2019లో తొలిసారిగా ఎన్నికలు జరగ్గా తాజాగా కొత్త చట్టం ప్రకారం రెండోసారి ఎన్నికలు జరగబోతున్నాయి.



నాడు ఎమ్మెల్యేకు.. నేడు సర్పంచ్‌కు..

భద్రాచలం పంచాయతీకి పోటీ చేస్తున్న రామకృష్ణ నేడు నామినేషన్ దాఖలు



భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గతంలో వీఆర్‌వోగా పని చేసి.. 2014 సాధారణ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి నాటి టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసి ఓటమి పాలైన మానె రామకృష్ణ నేటి పంచాయతీ బరిలో దిగుతున్నారు. ఈ సారి భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎస్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, నియోజకవర్గ నాయకులు రావులపల్లిరాంప్రసాద్ మానె రామకృష్ణను తమ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థిగా బరిలో దించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో గురువారం మానె రామకృష్ణ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకు కోసం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. అయితే 2014లో ఓటమి అనంతరం మానె రామకృష్ణ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి.. నియోజకవర్గ బాధ్యుడిగా కూడా పని చేశారు.

గెలిచిన మూగ ప్రేమ

పెళ్లిబంధంతో ఒక్కటైన జంట

బూర్గంపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రేమకు ఏదీ అడ్డుకాదు..ప్రాంతం, కులం, మతం అన్న భేద భావాలు ఉండవు. ఇద్దరి మధ్య ప్రేమ ఉంటే చాలు. మాటలు రాకున్నా...మౌనమే భాష అవుతుంది. వారికి ఏ సమస్యా అనిపించదు. పరస్పరం ఒకరినొకరు అర్థం చేసుకోగలరు. బూర్గంపాడుకు చెందిన కొండా జంపలరాజు హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన మాలోతు మల్లీశ్వరి సైతం హైదరాబాద్‌లో ఉంటుంది. వీరిద్దరు మిర్యాలగూడలో ఇంటర్మీడియట్ చదువుకునే క్రమంలో పరిచయం ఏర్పడి ప్రేమగా మారినట్లు వారు తెలిపారు. మూడు సంవత్సరాలు ప్రేమించుకంటున్న ఇరువురు మంగళవారం ప్రేమ వివాహం చేసుకుని బుధవారం బూర్గంపాడు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురు కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి ఇరువురిని ఒక్కటి చేశారు. ఇరువురు ఒకరినొకరు అర్థం చేసుకుని ప్రేమ వివాహం చేసుకున్న మూగ జంటను పలువురు అభినందించారు.


ఒక్కటైన ప్రేమజంట

రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఆదివాసీ విద్యార్థి

దుమ్ముగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై తండ్రికి తగ్గ తనయుడు అనిపించాడు కాటాయిగూడెంకు చెందిన ఆదివాసీ విద్యార్థి సోందె ఆర్యవర్ధన్. చర్ల రాహుల్ విజ్ఞాన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆర్యవర్ధన్ ఇటీవల కిన్నెరసానిలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచాడు. దీంతో కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14 విభాగం వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థి తండ్రి రత్నాకర్ ఒకప్పుడు మారుమూల ఆదివాసీ ప్రాంతం నుంచి వాలీబాల్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించి గోల్డ్ మెడల్స్‌తో పాటు ఎన్నో పతకాలు సాధించారు. పెద్దనాన్న చర్ల డిప్యూటీ తహసీల్దార్ సోందె ముద్దరాజు, తల్లిదండ్రులు రత్నాకర్, దేవి, ఎస్టీఎఫ్ కార్యదర్శి, పీఈటీలు, పీడీలు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


ఎంపికైన విద్యార్థి ఆర్యవర్ధన్

30న బాలికల అథ్లెటిక్స్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-14, 16 బాలికల విభాగంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్ అహ్మద్ ఒక ప్రకటన లో తెలిపారు. పోటీల్లో గెలుపొం దిన విజేతలకు మెడల్స్ సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటల కల్లా కళాశాల మైదానానికి చేరుకోవాలని కోరారు.

టిప్పర్ ఢీ.. 8 మేకలు మృతి

కాళ్లు కోల్పోయిన మరో నాలుగు మేకలు
లబోదిబో మంటున్న వృద్ధ ఒంటరి మహిళ
దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సుజాతనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగానీ డొక్కాడని ఓ వృద్ధ ఒంటరి మహిళకు మేకలను పోషించడమే జీవనాధారం. సుజాతనగర్ మండలం మంగపేట గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన హృదయ విదాయకరమైన ఘటనలో ఆమె పెంచుకునే మేకల గుంపును ఓ టిప్పర్ ఢీకొనడంతో 8 మేకలు మృతి చెందాయి. మరో 4 మేకలు కాళ్లు కోల్పోయి తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగపేట గ్రామానికి చెందిన గుగులోత్ సోని భర్త మరణించడంతో మేకల పెంపకాన్నే జీవనాధారంగా చేసుకుని బతుకుతోంది. రోజు మాదిరిగా మేకలను మేతకు తోలుకుపోవడానికి మంగపేట గ్రామ సమీపంలో ఖమ్మం- కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆర్‌వోబీ వంతెన దాటుతుండగా మేకల గుంపును వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కొన్ని రోడ్డుపై నుజ్జునుజ్జవగా మరికొన్ని ఎగిరి కొంతదూరంలో పడినాయి. దీంతో మేకల కాపరి కేకలు వేయడంతో అక్కడున్న వారు ఆ టిప్పర్‌ను అడ్డగించి ఆపారు. దీంతో ఆ వృద్ధ మహిళ మృతి చెందిన మేకలను చూసి బోరున విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సదరు అధికారులు ఆదుకోవాలని వేడుకుంటుంది.

శ్రీమద్భగవద్గీతా కంఠస్థ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఖమ్మం జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 2025- గీతా జయంతి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఖమ్మం నగరంలోని పలు పాఠశాలలు కళాశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు.


గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు

జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి డి.కృషిత, ద్వితీయ బహుమతి కె.హేమహన్విత, తృతీయ బహుమతి ఆర్.రేష్మిత, ప్రత్యేక బహుమతి ఎస్.శ్రీమాన్‌లు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు ప్రథమ బహుమతి కే.రిషిత (బాల భారతి), ద్వితీయ బహుమతి కె.శ్రీనిజ (రెజోనెన్స్ కళాశాల), తృతీయ బహుమతి వి.వెన్నెల గెలుపొందారు. ఇంటర్మీడియట్ సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి ఎస్.వల్లివాగ్దేవి (శ్రీ చైతన్య), ద్వితీయ బహుమతి కె.శ్రీనిధి (నారాయణ), తృతీయ బహుమతి మోహితకృష్ణ (హార్వెస్ట్) బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కవయిత్రి వనం తేజశ్రీ, ఎస్.చంద్రమౌళి, వైదేహి, ఎం.రమాదేవి, ఆర్.లక్ష్మి, సౌమ్యలు వ్యవహరించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్‌కే రెహానా బేగం, డాక్టర్ గోవింద క్రాంతి రణదేవ్, డాక్టర్ బి.జ్వలిత, ప్రముఖ ప్రవచకులు, కవయిత్రి వనం తేజశ్రీలు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత కంఠస్థ పారాయణ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో చదువులో రాణిస్తూ మరిన్ని విజయాలు సాధించాలన్నారు. అనంతరం విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 1,116, ద్వితీయ బహుమతిగా రూ. 816, తృతీయ బహుమతిగా రూ.516ల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను, మెమొంటోను, భగవద్గీత పుస్తకాలను అందించారు.

జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీల్లో భద్రాద్రి విద్యార్థులు

చిల్డ్రన్స్ అండ్ యూత్ డ్రాయింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు
అక్షయ్ డ్రాయింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి చిల్డ్రన్స్ అండ్ యూత్ డ్రాయింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన డ్రాయింగ్ విద్యార్థులు మెరిసారు. ఏపీలోని ఒంగోలు ప్రాంతంలో సృష్టి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన చిత్రలేఖనం జాతీయస్థాయి పోటీల్లో కొత్తగూడెం అక్షయ్ డ్రాయింగ్ స్కూల్ 14 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో వారు గీసిన చిత్రాలను పంపి పోటీల్లో ప్రతిభ చూపి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన వారిలో ఎన్.ఉష, ఏ.గ్రీష్మ, బి.ధన్యశ్రీ, ఎం.తన్విక్‌తేజ ఉన్నారు. అదే విధంగా మరో పది మందికి ప్రోత్సాహక, ధృవపత్రాలు పొందారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన డ్రాయింగ్ మాస్టర్, ప్రిన్సిపాల్ ఆంథోటి ప్రభాకర్‌కు చిత్రగురు అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం అక్షయ్ డ్రాయింగ్స్ స్కూల్‌లో ఈ అవార్డులు ప్రధాన కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


జాతీయ స్థాయిలో మెరిసి బంగారు పతకాలు సాధించిన నలుగురు భద్రాద్రి జిల్లా విద్యార్థులు

గుండాలలో హార్వెస్టర్ దగ్ధం

గుండాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు హార్వెస్టర్ దగ్ధమైన సంఘటన గుండాల మండలంలో బుధవారం చోటు చేసుకుంది. గుండాలకు చెందిన ఊడుగుల యాకయ్య హార్వెస్టర్‌ను లీజ్‌కు తీసుకువచ్చి మొక్కజొన్న, వరి పంటలను కోయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ముత్తాపురం- దొంగతోగు పరిధిలో మొక్కజొన్న పంటను కోసి చీకటి పడటంతో డ్రైవర్ పంట మధ్యలో నిలిపేశాడు. కాగా బుధవారం తెల్లవారుజామున అటుగా వెలుతున్న ఓ రైతు, చేనులో ఉన్న హార్వెస్టర్ కాలిపోతూ కనిపించడంతో ఈ విషయాన్ని గ్రామస్తులకు, సంబంధిత యజమానికి సమాచారం అందించాడు. ఇల్లెందు నుంచి ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. బ్యాటరీ షార్టేజ్ అవడంతో హార్వెస్టర్‌కి మంటలు అంటుకున్నాయా..? లేక ఎవరైన గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టారా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలుశిక్ష

మణుగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించేందుకు ఇచ్చిన చెక్ బౌన్స్ కేసులో ముద్దాయిని విచారించిన మణుగూరు జడ్జి కంబపు సూరిరెడ్డి నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రెండున్నర లక్షల నష్టపరిహారం విధిస్తూ బుధవారం తీర్పు నిచ్చారు. ఇందుకు సంబంధించి కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన మేకల రాజయ్య వద్ద సత్యనారాయాణ అనే వ్యక్తి 2018 అక్టోబర్ 21న రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మేరకు రుణం తిరిగి చెల్లించేందుకు అంత మొత్తానికి చెక్ ఇచ్చాడు. రాజయ్య ఆ చెక్కును బ్యాంక్‌లో జమచేయగా సరిపడ నగదు బ్యాంకు ఖాతాలో లేనందున చెక్ బౌన్స్ అయింది. దీంతో రాజయ్య న్యాయవాది ద్వారా ముద్దాయి సత్యనారాయణకు నోటీసు పంపినా ఎలాంటి స్పందన లేదు. దీంతో బాధితుడు రాజయ్య కోర్టును ఆశ్రయించాడు. వాదనలు, సాక్ష్యాదారులు పరిశీలించిన అనంతరం కోర్టు ముద్దాయి సత్యనారాయణ తప్పుచేసినట్లు నిరూపితమైందని తేల్చి ఆరు నెలల జైలుశిక్ష రూ.2.50 లక్షల నష్టపరిహారం విధిస్తూ తీర్పు ఇచ్చింది. రాజయ్య తరుపున న్యాయవాది కే.నగేష్ కుమార్ తన వాదనలు వినిపించారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి

చింతకాని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ప్రైవేటు ఎలక్ట్రీషియన్ శెట్టిపోగు రంగారావు (37) మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రైల్వే కాలనీ గ్రామంలో బుధవారం జరిగింది. మృతుడు ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో వ్యవసాయ విద్యుత్ మోటారుకు మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగలడంతో మృతిచెందాడు. ఘటనపై అందిన సమాచారం ప్రకారం ప్రాథమిక వివరాలు సేకరించిన ఎస్ఐ వీరేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


రంగారావు మృతదేహం



కస్నాతండాలో బీసీలపై వివక్ష: సీపీఎం

ఖమ్మం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్నాతండా గ్రామంలో 1200 ఓట్లకు ఎనిమిది వార్డులు ఉండగా ఎనిమిది వార్డుల్లో నాలుగు వార్డులు జనరల్‌కు, నాలుగు వార్డులు ఎస్టీలకు కేటాయించడం జరిగిందని సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు భూక్యా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గ్రామంలో జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు 400 మంది బీసీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. 400 మంది బీసీలు ఉన్నా కనీసం జనాభా ప్రాతిపదికన రెండు వార్డులు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు పునపరిశీలించి బీసీలకు జనాభా ప్రాతిపదికన వార్డులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చంద్రయ్య, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు..
పకడ్బందీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తాం. పంచాయతీ ఎన్నికలు అన్ని బ్యాలెట్ పద్ధతిలో జరుగుతున్నందున అక్కడ వెబ్‌కాస్టింగ్, రికార్డింగ్ ఉంటుంది. ఎన్నికల సందర్భంగా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు స్వీకరించడం జరుగుతుంది. 1077 టోల్‌ఫ్రీనెంబరు ఏర్పాటుచేశాం. ఎవరైనా ఫిర్యాదు చేయాలనకుంటే ఫిర్యాదు చేయొచ్చు.

ఆంధ్రజ్యోతి: హైకోర్టు స్టే ఇచ్చిన పంచాయతీల పరిస్థితేంటి?

కలెక్టర్: ఐదు గ్రామపంచాయతీలు 46వార్డులకు హైకోర్టుస్టే, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికలను నిలిపివేశాం. ఆ పంచాయతీలు షెడ్యూల్ ఏరియాలో లేవని కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు ఆగాయి. వీటిపై హైకోర్టు తీర్పు, ఎన్నికల కమిషన్ ఆదేశాలొస్తేనే ఎన్నికలు జరుగుతాయి

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు?

కలెక్టర్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 7,95,138మంది ఓటర్లుండగా ఇందులో పురుషులు 3,84,649, మహిళలు 4,10,467, ఇతరులు 22మంది ఉన్నారు. మొత్తం 5,168 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. బ్యాలెట్ పేపర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. 5,746బ్యాలెట్ బాక్సులు కూడా సిద్ధంగా ఉంచాం. వీటితో పాటు జంబో బ్యాలెట్ బాక్సులు కూడా ఉన్నాయి. పోలింగ్ ఆఫీసర్లు 3442 మంది, 4217మంది సిబ్బందిని వినియోగిస్తున్నాం. 648మంది మైక్రో అబ్జర్వర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. నామినేషన్ల కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పోలింగ్, కౌంటింగ్‌కు తీసుకుంటున్న చర్యలు?

కలెక్టర్: నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణతో పాటు పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రక్రియంతా సవ్యంగా జరిగేలా చర్య లు చేపట్టాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అలాగే పోలింగ్ రోజునే మధ్యాహ్నం తర్వాత కౌటింగ్ ఉంటుంది. అదేరోజు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: కులధ్రువీకరణ పత్రాలు ఎప్పుడు సమర్పించాలి? నామినేషన్ల ధరావత్‌లు ఎంత?

కలెక్టర్ : నామినేషన్లపత్రాలతో పాటే కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఇక సర్పంచ్ పదవికి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1000, వార్డు పదవికి జనరల్ రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250 చెల్లించాలి. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ అభ్యర్థి ఎన్నికల నియమావళి ప్రకారం ఖర్చుచేయాలి. 5వేలపై జనాభా ఉన్న సర్పంచ్ అభ్యర్థికి రూ.2,50,000, వార్డుకు రూ.50 వేలు, 5వేల జనాభలోపు ఉన్న పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ.1,50,000, వార్డు అభ్యర్థి రూ.30వేలు ఖర్చుచేసే అవకాశం ఉంది. ఎన్నికల నియమావళి ప్రకారం మండల, గ్రామస్థాయిలో వ్యయపరిశీలన కమిటీలు ఉంటాయి. ఎవరైనా ఓటర్లకు ప్రలోభాలు గురిచేస్తే చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: పోటీకి ముగ్గురు పిల్లల నిబంధన సడలింపు జరిగిందా?

కలెక్టర్: ముగ్గురు పిల్లలున్నవారు కూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. తాజాగా ఎన్నికల నియమావళిలో మార్పుచేశారు. అలాగే నామినేషన్లలో శిక్షకు గురైనవారు, బుద్ధి మాంద్యం, డిఫాల్టర్లు, పోటీచేయడానికి అనర్హులు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

ఖమ్మం అర్బన్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని సంయుక్తకిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు బొంతు రాంబాబు, కొండపర్తి గోవిందరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కొల్లేటి నాగేశ్వరరావు, వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతు ఉద్యమ ఐదో వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్యాణం వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, కే. శ్రీనివాస్ ల అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఖమ్మం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఖమ్మం రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ అన్నారు. ఏదులాపురం పరిధిలోని సర్వే నంబర్-136లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇట్టి భూములను ప్రభుత్వం, ప్రజా అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

ఖమ్మం అర్బన్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సీపీఎం రఘునాథపాలెం మండల కమిటీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రఘునాథపాలెం సీపీఎం కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి, షేక్ మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్ బత్తిని ఉపేందర్, తదితరులున్నారు.

ఖమ్మం రూరల్: రాబోయే స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రజల ను కోరారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బ య్య భవన్‌లో బుధవారం జరిగిన సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నాయకులు కరుణాకర్, నండ్రా ప్రసాద్, సంగయ్య, నందిగామ కృష్ణ, మోహన్‌రావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కౌన్సెలింగ్

ఖమ్మంక్రైం, నవంబరు26(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఇటీవల నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 39మంది వాహనదారులకు జరిమానా విధించి వారి కుటుంబసభ్యుల సమక్షంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యంమత్తులో డ్రైవింగ్‌చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐపీకేఎంఎస్ కార్యవర్గం ఎన్నిక

తిరుమలాయపాలెం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయకార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్)జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండలంలని దమ్మాయిగూడెంలో ఎన్నిక జరిగింది.అధ్యక్ష కార్యదర్శులుగా గంటా శ్రీనివాసరావు, ప్రధా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, ఉపాధ్యక్షుడుగా రెంటాల యాదగిరి, సహాయకార్యదర్శిగా కంకణాల అర్జునరావు, కోశాధికారిగా పాపారావు, 11మంది నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శివలింగం, వెంకటఅప్పారావు, నాగేశ్వరావు, వెంకన్న, పాల్గొన్నారు.

మిర్చితోటల పరిశీలన

తిరుమలాయపాలెం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో మిర్చితోటలను ఉద్యనశాఖ శాస్త్రవేత్తలు డాక్టర్‌ప్రశాంత్, ఉద్యానపరిశోధన మల్యాల డాక్టర్ భాగ్యశాలి జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ పరిశీలించారు. మండలంలోని బచ్చోడులో పరిశీలించారు. ఈసందర్భంగా వేరుకుళ్లు ఆశించిన తోటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో డీడీ ముత్యాలు, మధిర, పాలేరు ఉద్యాన అధికారుల విష్ణు, అపర్ణ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల మార్కెట్..
సమస్య కొలిక్కి

- ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలోని వారికి స్థాన చలనం
- దుకాణాలకు మించిన డిమాండ్‌తో డిపాజిట్లు చెల్లింపులు
- నేడు భక్తరామదాసు కళాక్షేత్రంలో దుకాణాల కేటాయింపు డ్రా



ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అన్ని కూరగాయల దుకాణాలకు భిన్నంగా ఉంటుంది పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల దుకాణం. నగరం నడి వోడ్డున ఉండటంతో పాటుగా సిటీ బస్టాండ్‌లో దిగిన ఉద్యోగులు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో కూరగాయల కొనుగోలుకు వచ్చిన వ్యాపారులకు అనుకూలంగా వీధి వ్యాపారుల మార్కెట్ అందుబాటులో ఉంది. అయితే కొద్ది మంది వ్యాపారుల తీరు కారణంగా వీది వ్యాపారుల మార్కెంట్ అప్రతిష్టను మూటగట్టుకొంది. కూరగాయల ధరల అడిగినందుకు కొనుగోలుదారులపై దాడులు జరిగాయి. ఈ క్రమంలో వీధి వ్యాపారుల మార్కెట్‌లోని కొద్ది మంది వ్యాపారులపై 15 కేసులు వరకు నమోదు జరిగాయి.

వీది వ్యాపారుల మార్కెట్‌లో ప్రధాన ద్వారాల నుంచి కొన్ని దుకాణాల్లో ఐదేళ్లుగా ఒకే వ్యాపారులు కూరగాయలు అమ్మకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఆయా వ్యాపారుల కుటుంబ సభ్యులతో వరసగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ధరలను ప్రశ్నించిన కొనుగోలుదారులపై మూకుమ్మడి దాడులకు ఒకే కుటుంబంలోని ఎక్కువ మంది సభ్యులు ఉండటమే కారణంగా అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా పూర్వ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో మార్కెట్‌ను అభివృద్ధికి కార్యచరణ చేశారు. స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ వినతిమేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. శాశ్వతమైన షెడ్ల నిర్మాణాలు చేశారు. మార్కెట్‌ను అభివృద్ధి చేసిన అధికారులు ప్రక్షాళన, ఆదాయ మార్గాలపై ఆలోచన చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆధ్వర్యంలో మార్కెట్ పునఃపరిశీలన బాధ్యతలను మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణ బాధ్యతలు నిర్వహించారు. గత రెండు నెలలుగా మార్కెట్‌లో మార్పులు చేశారు. మార్కెట్‌లోని దుకాణాలకు జీయో ట్యాగింగ్ చేసి 210 దుకాణాలను గుర్తించారు. వాటికి నెంబర్లు కేటాయించారు. అలాగే మార్కెట్‌లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న వ్యాపారుల ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను సేకరించారు.

అమ్మకాల ఆధారంగా అద్దెలు

వీధి వ్యాపారుల మార్కెట్‌ను మూడు విభాగాలుగా విభజన చేశారు. ఎక్కువ అమ్మకాలు జరిపే దుకాణాల నెంబర్లు నమోదు చేశారు. తర్వాత తక్కువగా అమ్మకాలు జరిపే దుకాణాలు, మూడో విభాగంలో ఆకు కూరలు, నిమ్మకాయలు వాటిని విభజన చేశారు. అధికంగా అమ్మకాలు జరిపే వాటికి అధికంగా అద్దెలను, తక్కువగా అమ్మకాలు జరిగే వాటికి తక్కువ అద్దేలను నిర్ణయించారు. మూడు విభాగాల్లో అద్దెలు అమలు చేసేందుకు అధికారులు కార్యచరణ చేశారు.

వీధి వ్యాపారుల మార్కెట్‌లో 210 దుకాణాలను అధికారులు గుర్తించారు. అయితే కూరగాయల అమ్మకాలు అధికంగా ఉండటంతో నగరంలో ఏ మార్కెట్‌లో లేని విదంగా రూ.10వేలు డిపాజిట్‌లు వచ్చాయి. 210దుకాణాలకు 250కు పైగా వ్యాపారులు రూ.10వేల చొప్పున డిపాజిట్లు చెల్లించారు. దివ్యాంగులకు మాత్రం రూ.5వేలకు సడలింపు ఇచ్చారు. అన్ని డిపాజిట్ విధానం పెట్టినా కూడా దుకాణాలకు మించిన స్థాయిలో వ్యాపారులు డబ్బులు చెల్లించటంతో దుకాణాలు కేటాయింపుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నేడు లాటరీ ద్వారా ఎంపిక

వివాదాలకు నిలయంగా వీధి వ్యాపారుల మార్కెట్ రికార్డులకు ఎక్కింది. వ్యాపారుల సర్వే సమయంలోనే మార్కెట్ ఈవోపై కొంత మంది దాడులు చేయటంతో ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు జరిగింది. దుకాణాలకు నెంబర్లు కేటాయింపు సమయంలోను ఓ మహిళ వ్యాపారి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ క్రమంలో గురువారం నిర్వహించే దుకాణాల కేటాయింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో లాటరీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. నగర ప్రజాప్రతినిదులు, అధికారుల సమక్షంలో లాటరీ ద్వారా దుకాణాలను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణ ఏర్పాట్లు చేశారు.

బార్ కౌన్సిల్‌కు మోగిన ఎన్నికల నగారా

ఖమ్మం లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బార్‌కౌన్సిల్ కు ఎన్నికలు నిర్వహించటానికి బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యదర్శి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికలు జనవరి 30న జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 10న జరుతుందని, డిసెంబరు 1న ప్రాథమిక ఓట రు జాబితా ప్రకటన, డిసెంబరు 10న తుది జాబితా, డిసెంబరు 24న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్, డిసెంబరు 29న నామినేషన్ల స్వీకర ణ, జనవరి 9 నామినేషన్ల స్వీకరణ చివరితేదీగా, నామినేషన్ల స్క్రూట్నీ జనవరి 13 నుంచి 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ, జనవరి 17న తుది అభ్యర్థుల ప్రకటన తరువాత జనవరి30న ఎన్నికలు జరుగతాయన్నారు. ఫిబ్రవరి10 ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నా రు. ఖమ్మం బార్ అసోసియేషన్ నుంచి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు మందడపు శ్రీనివాసరావు, తాళ్ళూరి దిలీప్ చౌదరి, మర్రి ప్రకాష్‌లు బార్ కౌన్సిల్‌కు పోటీ పడుతూ ఇప్పటికే వివిధ బార్ అసోసియేషన్లు తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

'వరి కొయ్యలను కాల్చొద్దు'

ఖమ్మం అర్బన్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో పత్తికట్టె, వరికొయ్యలను తుగలబెట్టటం ద్వారా భూమి నిస్సారమవుతుందని రఘునాథపాలెం మండల వ్యవసాయాదికారి పుల్లయ్య రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని చింతగుర్తి, పరికల బోడు తండాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో బాలబత్తుల శిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన 'ఛాంబర్' కొత్త కమిటీ



బాధ్యతలు స్వీకరించిన ఛాంబర్ నూతన పాలకవర్గం

ఖమ్మం మార్కెట్ , నవంబరు 26(ఆంధ్రజ్యోతి) ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛాంబర్‌కు ఇటీవల కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు, ప్రధాన కార్యదర్శి సోమా నర్సింహరావు(జీవై నరేష్), ట్రెజరర్ తల్లాడ రమేష్, ఉపాధ్యక్షుడు బత్తిన నర్సింహరావు, సహాయ కార్యదర్శి బాదె రవి, సెంట్రల్ ఈసీ సభ్యులు మాటేటి కిరణ్, రాయపూడి రవికుమార్, వంగవీటి హరీష్, సుఖాసి శేషగిరిరావు, పోట్ల రామనాథం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ సభ్యులను వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గుండాల కృష్ణ, మాజీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని క్రిష్ణారావు, కొప్పు నరేష్, మాజీ సెక్రటరీలు మెంతుల శ్రీశైలం, గుర్రం ఉమామహేశ్వరరావు, భద్రాద్రి బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, పారా నాగేశ్వరరావు, పలువురు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న దిగుమతి శాఖ సభ్యులు

దిగుమతి శాఖ బాధ్యతల స్వీకరణ

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో కీలకమైన కమిషన్ వ్యాపారులకు(అడ్తీ సెక్షన్) చెందిన దిగుమతిశాఖ నూతన కమిటీ బుధవారం పదవీ బాధ్యత చేపట్టారు. ఈ సందర్భం గా ఆ శాఖ అధ్యక్షుడు వడ్డె వెంకటేశ్వర్లు, కార్యదర్శి యార్రా అప్పారావు, కార్యవర్గ సభ్యులు సారిక పాపారావు, బండి సతీష్, జంగిలి రమణ, సిరికొండ వెంకటేశ్వర్లు, సాదె శంకర్, జుట్టుకొండ చైతన్య, బాలసన్మదికుమార్, రావుల శ్రీనివాసరావు, కందిబండ నరసింహరావు దిగుమతి శాఖ నూతన కార్యాలయంలో కొలువుదీరారు. ఈ సందర్భంగా వారిని ఛాం బర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పలువురు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఖమ్మం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ఆరెంపుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు, గ్రామశాఖ అధ్యక్షుడు బండి సతీష్ బుధవారం మండల కాంగ్రెస్ నాయకుడు బండి జగదీష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి సతీష్‌కు కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బండి రవి, రాధాకృష్ణ, మహేష్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, దావూద్, రమణ, జానీ, యాకయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సతీష్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న దయాకర్‌రెడ్డి

నేత్ర పర్వంగా పదునెట్టాంబడి పూజ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్ రోడ్ చైతన్య నగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్మించిన పదునెట్టాంబడికి బుధవారం ఆలయ ప్రధాన పూజారి నారాయణ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రథమ పూజ నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి సభ్యుడు లాలయ్య, వెంకట్రావమ్మ కుమారుడు నాగేశ్వరరావు 18వ పడి మాలధారణ సందర్భంగా పదునెట్టాంబడి పూజ నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది.



పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు



పూజల్లో పాల్గొన్న ఒకటవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఉమాదేవి

ఈ పూజలలో ఒకటవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి కర్రి ఉమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పలకు, భక్తులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మేకల హనుమంతరావు, కోశాధికారి అట్లూరి మధు, సెక్రటరీ గుర్రాల శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ పుల్లంరాజు, ఆర్గనైజర్ సెక్రటరీ సరిపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ షష్ఠి (స్కంద షష్ఠి) సందర్భంగా నగరంలోని పలు సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని భ్రమరాంబ సమేత శ్రీ గుంటుమల్లేశ్వర స్వా మి ఆలయంలో కనుల పండువగా సుబ్రహ్మ ణ్య ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దాములూరి వీరభద్రశర్మ, కృష్ణశర్మలు స్వామి కల్యాణం జరిపించారు. ఆలయ ఈవో చందూరి రామకోటేశ్వరరావు భక్తులుపాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఖమ్మంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిరుపతి

ఖమ్మం ఖానాపురంహవేలి/ఖమ్మం చర్చికాంపౌండ్/ఖమ్మం కార్పొరేషన్ /ఖమ్మం లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నగరంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ భారత రాజ్యాంగం గురించి వివరించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పూనుకొల్లు నీరజ పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రాజ్యాంగ విలువలు, నియమాలు, హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. భారత రాజ్యాంగం విశిష్టమైనదని, ఇది దేశానికి అత్యున్నత చట్టం అని ప్రజలకు ఏ హక్కులు ఉన్నాయో బాధ్యతలు అన్ని ఉన్నాయని, ప్రభుత్వ అధికారాలు, పాలన గురించి భారత రాజ్యాంగం 26 నవంబరు 1949 న స్వీకరించబడిందని, 26 జనవరి 1950 న అమల్లోకి వచ్చిదని అన్నారు. భారత రాజ్యాంగం సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య లక్షణాలు గలదని, ముఖ్యంగా రాజ్యాంగం ప్రజల హక్కులను రక్షిస్తుందని, ప్రభుత్వ అధికారాలను పరిమితం చేస్తూ దేశంలో చట్టం సమానత్వం, న్యాయాన్ని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. అన్ని మతాలు, బాషలు, జాతులు సమానంగా జీవించేందుకు మార్గం చూపుతుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ వాటి ప్రాముఖ్యతను వివరించారు.



కేఎంసీలో పాల్గొన్న మేయర్ పునుకొల్లు నీరజ, అధికారులు



ఖమ్మం పరేడ్‌గ్రౌండ్‌లో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు



హార్వెస్ట్‌లో...



న్యూవిజన్‌లో...



సర్వజ్ఞలో...



త్రివేణిలో..

రూ.50వేల బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న చైర్మన్ యలగొండస్వామి

ముదిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు బంకా సత్యనారాయణ ఇటీవల మృతిచెందగా ఆయనకుసొసైటీలో సభ్యత్వం ఉండడంతో రూ.50వేల చెక్కును బుధవారం మృతుడి భార్య సలోమికి సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అందజేశారు. వైస్‌చైర్మన్ బట్టు పురుషోత్తం, డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సీఈవో బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- గ్రామాల్లో ఎన్నికల సందడి



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

మధిర రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల హడావుడి నెలకొంది. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈమేరకు నామినేషన్ల సెంటర్ల వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మధిర మండలంలో మొత్తం 27గ్రామపంచాయతీలున్నాయి. 236వార్డులున్నాయి. 14పంచాయతీలు జనరల్, 8ఎస్సీలకు, నాలుగు బీసీలు, ఒకటి ఎస్టీకి కేటాయించబడ్డాయి. మండలం మొత్తం మీద 8చోట్ల నామినేషన్ల కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మల్లారం, సిరిపురం, ఆత్కూరు, మాటూరుపేట, సిద్ధినేనిగూడెం, ఖమ్మంపాడు, రాయపట్నం, మహదేవపురం గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాలను తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ బుధవారం పరిశీలించారు. అన్ని రాజకీయ పార్టీలు మెజార్టీ పంచాయతీలను దక్కించుకొనేందుకు వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. మండలంలో బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల మధ్య పొత్తు ఖరారైంది. ఇరు పార్టీలు బుధవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నారు.

ప్రశాంత ఎన్నికలపై అవగాహన సదస్సులు



లింగాలలో ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హరిత

కల్లూరు: కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల ప్రశాంతతపై బుధవారం నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని లింగాల, పేరువంచ, ఎర్రబోయనపల్లి, మర్లపాడు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హరిత మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలు, పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నం కాకుండా ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణులు, అభ్యర్థులు సహకరించాలని కోరారు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఎవరైన దౌర్జ్యనాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందని వివరించారు. ఎన్నికల నియమావళిని తప్పని సరిగ్గా పాటించాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే మంచిదని ఎస్‌ఐ చెప్పారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యకమాల్లో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులుపాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

కొణిజర్ల: గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో వర్ల, ఎంపీవో ఉపేంద్రయ్య తెలిపారు. మొదటి విడతలోనే కొణిజర్ల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో మొత్తం 27గ్రామపంచాయతీలకు నామినేషన్లను స్వీకరించేందుకు 9సెంటర్లను ఏర్పాటు చేశారు. గుబ్బగుర్తినామినేషన్ కేంద్రంలో గుబ్బగుర్తి, అంజనాపురం, ఉప్పలచలక, గద్దలగూడెం, గ్రామాలవారు గుబ్బగుర్తి గ్రామపంచాయతీ ఆఫీసులో నామినేషన్లు వేయాల్సి ఉంది. తీగలబంజర, సిగరాయపాలెం, గుండ్రాతిమడుగు గ్రామాలు లక్ష్మీపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల కేంద్ర పరిధిలో లక్ష్మీపురం, మేకలకుంట, సాలబంజర గ్రామాలు, కొణిజర్ల నామినేషన్ కేంద్రంలో కొణిజర్లతోపాటు మల్లుపల్లి, తనికెళ్ల గ్రామపంచాయతీ నామినేషన్ పరిధిలో తనికెళ్లతోపాటు బొడియాతండా గ్రామాలు తుమ్మలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో తుమ్మలపల్లితో పాటు అన్నవరం గ్రామం పెద్దమునగాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో పెద్దమునగాలతోపాటు చిన్నమునగాల, పాండవనమాల, కొత్తకాచారం గ్రామలు, అమ్మపాలెం పంచాయతీ నామినేషన్ కేంద్రంలో అమ్మపాలెంతోపాటు రాజ్యాతండా, చిన్నగోపతి గ్రామాలు, లింగగూడెం పంచాయతీ నామినేషన్ కేంద్రంలో లింగగూడెం, పెద్దగోపతి, గోపవరం వారు నామినేషన్లు వేయాలి. 27గ్రామపంచాయతీలకు గాను 254 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేశారు. ఎన్నికల నిర్వాహణకు 736 మంది సిబ్బందిని ఏర్పాటుచేశారు. నామినేషన్లను స్వీకరించేందకు 9 కేంద్రాలకు 22మంది సిబ్బందిని నియమించారు.

శాంతిభద్రతలపై దృష్టి

- స్టేషన్‌ను పరిశీలించిన ఏసీపీ

ఏన్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వాహనలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. బుధవారం ఏన్కూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా రికార్డులను, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలని సూచించారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి పూట గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. క్రైం రేటు ఎలా ఉందని ఏన్కూరు ఎస్‌ఐ సంధ్యను అడిగారు. అనంతరం సిబ్బందితో మాట్లడి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ముత్తిలింగం, ఎస్‌ఐ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠామహోత్సవం



ప్రతిష్ఠా మహత్సవలో పాల్గొన్న భక్తులు

తల్లాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని గంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఆదిత్యాది నవగ్రహ 27నక్షత్రాలు, జగద్గురు ఆదిశంకరాచార్య స్వామివార్ల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆయల ప్రధాన అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో చండీఉపాసకుల రాజోలు భాను రవికిరణశర్మ శిష్యబృందం ప్రతిష్ఠమహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వేదపారాయణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యహవచనం, వాస్తు పూజ, నవగ్రహాలు, 27 నక్షత్రాలు, వాసుకీ సుబ్రహ్మణ్య జగద్గురు ఆదిశంకరాచార్య స్వామివార్ల విగ్రహప్రతిష్టాపన దిగ్విజయంగా జరిగింది. ప్రతిష్ఠా కార్యక్రమానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో తల్లాడ పురవీధులన్నీ భక్తులతో కిటకిటలడాయి. అనంతరం భక్తులకుఅన్నదానం చేశారు.

పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



ఏడీఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

ముదిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏడీఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు ఉద్యోగోన్నతి పొందారు. ఏడీఈ సత్యనారాయణ డీఈగా వరంగల్‌కు బదిలీ కాగా, ఏఈ శ్రీనివాసరావు మరిపెడ ఏడీఈగా ఉద్యోగోన్నతి సాధించారు. ఈమేరకు బుధవారం ముదిగొండ విద్యుత్ సిబ్బంది ఓ ఫంక్షన్‌లో వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. వారి స్థానంలో ఏడీఈగా ఏ.రమ్య, ఏఈగా కె.రామకృష్ణ స్వీకరించగా వారిని కూడా సన్మానించారు. పమ్మి, ముదిగొండ సిబ్బంది పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సండ్ర

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా మండలంలోని లోకవరం మాజీ సర్పంచు కళ్యాణపు కొండలరావు మాతృమూర్తి వరలక్ష్మి(90) బుధవారం ఉదయం 8గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర లోకరవరంలోని కళ్యాణపు కొండలరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పునిచ్చారు. కుటుంబ సభ్యులకు సానూభూతి సంతాపం తెలిపారు. అనంతరం పుల్లయ్యబంజరలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు ఈశ్వరమ్మ దశదిన కార్యక్రమం సందర్భంగా నివాస గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ మేరకు సండ్రతో పాటుగా ఆయా కుటుంబాలను పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, పెద్దబోయన మల్లేశ్వరరావు, సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఇస్మాయిల్, మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్‌లు, సిహెచ్ కిరణ్‌లు, సిపిఐ మండల కార్యదర్శి దమాల దయాకర్, ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబులు ఉన్నారు.

ఏకగ్రీవం దిశగా ఆ రెండు గ్రామాలు

- బరిలో బలమైన అధికార పార్టీ నేతలు
- ఆ పంచాయతీలు కాంగ్రెస్ ఖాతాలోకే ?



రాయనపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

బోనకల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కలకోట, రాయనపేట గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసే దిశగా చర్చలు నడుస్తున్నాయని తెలిసింది. కలకోట గ్రామానికి చెందిన పైడిపల్లి కిషోర్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు కావడంతో పాటు అన్ని గ్రామాల్లో ఆయనకు మంచి పట్టుంది. గత మూడు పర్యాయాలుగా ఆయన ఆధ్వర్యంలోనే కలకోట పంచాయతీ సర్పంచ్‌లు ఎన్నిక కావడం జరుగుతోంది. ప్రస్తుతం ఆ గ్రామం జనరల్‌కు రిజర్వు కావడంతో ఆయన సతీమణీ బరిలో దిగనున్నారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా గ్రామాన్ని మార్చడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తారన్న ఆశాబావం అందరిలో ఉంది. దింతో పలు పార్టీల నాయకులతో ఏకగ్రీవం దిశగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. అదే విదంగా రాయనపేట గ్రామానికి చెందిన కర్నాటీ రామకోటేశ్వరరావు ఆత్మ కమిటీ, సొసైటీ చైర్మన్‌గా పని చేస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. గ్రామాభివృద్ధిలో ఇప్పటి వరకు తన వంతుగా కృషి చేయడంతో పాటు సౌమ్యుడిగా, వివాద రహితుడిగా మంచి పేరుంది. ఈ గ్రామంలో కూడ జనరల్‌కు రిజర్వు కావడంతో ఆయనే స్వయంగా పంచాయతీకి బరిలో దిగుతుండగా ఏకగ్రీవం చేసేందుకు గానూ చర్చలు నడుస్తున్నాయి. రెండు గ్రామాల్లో కాంగ్రెస్‌లో గట్టి నేతలుగా పేరున్న నాయకులే బరిలో ఉండటతో అభివృద్ధి మంత్రం బాగా పనిచేస్తుందన్న ఆలోచనతో ఏకగ్రీవ గాలులు వీచే అవకాశం కనిపిస్తున్నాయి.

వైద్యాధికారి అరుణాదేవికి సన్మానం

ముదిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అంకం అరుణాదేవికి జిల్లా డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమేరకు బుధవారం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వినూత్నంగా అరుణాదేవికి విధులకు వచ్చే సమయంలో ఆమెపై పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మరో రెండురోజుల్లో బదిలీపై వెళ్లనున్న తన పట్ల వైద్యసిబ్బంది చూపించిన అభిమానాన్ని చూసి భావోద్వేగానికి గురయ్యారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేయడం వల్లనే అరుణాదేవికి గుర్తింపు వచ్చిందని మండల ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో ముదిగొండ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్లకు పూర్తయిన ఏర్పాట్లు

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 22గ్రామపంచాయతీల్లో 200వార్డులకు 22మంది సర్పంచ్ అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు ఏడు క్లస్టర్లను ఏర్పాటుచేశారు. గన్నవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గోవిందాపురం, ఖానాపురం, కొండకొడిమ, గన్నవరం పంచాయతీలకు, సిరిపురంలో పుణ్యాపురం, సిరిపురం, స్టేజీ పినపాక పంచాయతీలకు, ముసలిమడుగులో స్నానాల లక్ష్మీపురం, ముసలిమడుగు, నారపనేనిపల్లి పంచాయతీలకు, గరికపాడులో లింగన్నపాలెం, దాచాపురం, గరికపాడు, విప్పలమడక పంచాయతీలకు, పాలడుగులో వల్లాపురం, పాలడుగు పంచాయతీలకు, గొల్లపూడిలో అష్ణగుర్తి, గొల్లపూడి, గొల్లెనపాడు పంచాయతీలకు, రెబ్బవరంలో కొష్టాల, రెబ్బవరం, తాటిపూడి పంచాయతీలకు 27నుంచి 29వతేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో సక్రియ తెలిపారు. 22గ్రామపంచాయతీల్లో 27,306మంది ఓటర్లు ఉన్నారు.

గురుకులాన్నిప సందర్శించిన డీఐఈవో

కారేపల్లినవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలను డీఐఈవో రవిబాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోనే అన్ని తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల భోదనపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో భోజనశాల, స్టోర్‌రూం, టాయిలెట్స్, ఆహార పట్టిక, ప్రయోగశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ప్రతి రోజు భోజనం ఇలాగే పెడతారా అని అడిగారు. కళాశాల పరిసరప్రాంతాలను సిబ్బంది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భోదనవిషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దార సావిత్రి, జిల్లా ఆర్ఎల్‌సీ అరుణకుమారి పాల్గొన్నారు.

నేడు అమరవీరుల స్థూపం వద్ద దీక్ష

కారేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పీఆర్టీయూ జిల్లా కమిటీ పిలుపును అనుసరించి నేడు జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించే 30గంటల నిరాహార దీక్షలకు మండల పరిధిలోని సంఘం బాధ్యులు తరలిరావాలని జిల్లా నాయకులు బాలినేని వెంకటరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఉదోగ్య విరమణ పొంది సంవత్సరాలు గడుస్తున్నా వారికి చెల్లించాల్సిన బకాయిలు ఒక్క రూపాయి విడుదల చేయలేదని, ఎంతో మంది వేదనతో మరణించారని, పిఆర్సి కాల పరిమితి దాటిన ఇంతవరకు దాని ఊసులేదని, డీఏలు ప్రకటించలేదన్నారు. సమస్యల సాధన కోసం 30గంటల నిరాహార దీక్ష చేయాడానికి సంఘం పిలునిచ్చిందన్నారు. దీక్షలో పాల్గొనేందుకు సంఘం సభ్యులు, రిటైర్ అయినవారు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా బాధ్యులుతోపాటు మండల అధ్యక్ష, కార్యదర్శులు అంగోత్‌శంకర్, వాకుండోత్ మంగీలాల్ పాల్గొన్నారు.

పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో.. మంత్రి పొంగులేటి



చింతనిప్పు సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ, ఎమ్మెల్యే

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. స్థానిక ఆరోవార్డు సుందరయ్యనగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పొంగులేటి ప్రధాన అనుచరుడు చింతనిప్పు సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వైరాలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, బీడీకే.రత్నం, జాలాది రామకృష్ణ, వీరంశెట్టి సీతరాములు, మచ్చా రామారావు, పోలా శ్రీను, రేచర్ల సత్యం, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మధిర రూరల్: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మధిరలో పర్యటించి పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధిర మునిసిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత యన్నం కోటేశ్వరరావు తండ్రి వెంకట్రావ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంత్రి పొంగులేటి యన్నం వెంకట్రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, నాయకులు అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కోట రాంబాబు, దేవిశెట్టి రంగారావు, కటికల సీతరామిరెడ్డి పాల్గొన్నారు. ఆతర్వాత కాంగ్రెస్ నేత శ్రీనివాసరెడ్డి రమ్యారెడ్డి వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

మధిర జీజేసీలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

మధిర రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ బీ.జైదాస్ మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు అందరికి అందాలని, అదరికి విద్యావకాశాలు కల్పించబడాలని ఆర్థిక అసమానతలు లేకుండా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో బి.తౌరియా మాట్లాడుతూ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచన సంఘం 1947 ఆగస్టు 29న ఏర్పడిఇందని, ఏడుగురు కమిటీ సభ్యులకు అధ్యక్షులుగా అంబేద్కర్ వివిధ దేశాల రాజ్యాంగాన్ని సుమారుగా మూడు సంవత్సరాలు పర్యటించి ముఖ్యమైన అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారని ప్రస్తుతం వారి ఫలాలు మనందరం అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ కొమ్ము గురవయ్య, అధ్యాపకులు ఎండీ. షహీన్‌బేగం, ఆర్‌సీహెచ్. సాంబయ్య, బి.ఉపేందర్, జి.విక్రమ్, టి.దేవాస్, ఎం.లాలయ్య, కె.కొండలరావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ఏన్కూరులో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు



దెందుకూరులో అన్నదాన కార్యక్రమం దృశ్యం

ఏన్కూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. పురాతన శివాలయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామివారికి కావిడి సేవలో భాగంగా పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. అనంతరం కళ్యాణోత్సవం, మహాఅన్నదానం వైభవంగా సాగింది. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. కావిడీలతో దంపతులు గ్రామోత్సవం చేశారు. హైకోర్టు న్యాయవాదులు మాదిరాజు శ్రీనివాసరావు, రామరావు, దెందుకూరి మఠ అర్చకులు హనుమంత్‌రామాచార్యులు, రంగాచార్యులు విశ్రాంత ఉపాధ్యాయులు, సీతారామందరరావు పాల్గొన్నారు.

మధిరలో..

మధిర రూరల్: మధిర మండలం దెందుకూరు నాగేంద్రమ్మస్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్వేశ్వరస్వామి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం పదిగంటలకు వేదపండితుల మంత్రోశ్చరణుల నడుమ కల్యాణ వేడుకలను ఘనంగా జరిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మధిరలోని వాసవీమాత ఆలయంతోపాటు, బంజారా కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాంతి, భద్రతల పరిరక్షణలో పోలీస్ విభాగం ఎంతో ప్రత్యేకం



నివాళులర్పిస్తున్న కమాండెంట్ పెదబాబు



బెటాలియన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతల పరిరక్షణలో పోలీస్ విభాగం ఎంతో ప్రత్యేకమని 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజును గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ విలువలు, పౌరహక్కులు, బాధ్యతలు, కర్తవ్యాలపై అవగాహన కల్పించారు. హక్కుల-కర్తవ్యాలను గౌరవిస్తూ సేవ చేయాలని ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పంచాయతీ ఎన్నికలకు.. పకడ్బందీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తాం. పంచాయతీ ఎన్నికలు అన్ని బ్యాలెట్ పద్ధతిలో జరుగుతున్నందున అక్కడ వెబ్‌కాస్టింగ్, రికార్డింగ్ ఉంటుంది. ఎన్నికల సందర్భంగా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు స్వీకరించడం జరుగుతుంది. 1077 టోల్‌ఫ్రీనెంబరు ఏర్పాటుచేశాం. ఎవరైనా ఫిర్యాదు చేయాలనకుంటే ఫిర్యాదు చేయొచ్చు.

ఆంధ్రజ్యోతి: హైకోర్టు స్టే ఇచ్చిన పంచాయతీల పరిస్థితేంటి?

కలెక్టర్: ఐదు గ్రామపంచాయతీలు 46వార్డులకు హైకోర్టుస్టే, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికలను నిలిపివేశాం. ఆ పంచాయతీలు షెడ్యూల్ ఏరియాలో లేవని కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు ఆగాయి. వీటిపై హైకోర్టు తీర్పు, ఎన్నికల కమిషన్ ఆదేశాలొస్తేనే ఎన్నికలు జరుగుతాయి

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు?

కలెక్టర్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 7,95,138మంది ఓటర్లుండగా ఇందులో పురుషులు 3,84,649, మహిళలు 4,10,467, ఇతరులు 22మంది ఉన్నారు. మొత్తం 5,168 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. బ్యాలెట్ పేపర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. 5,746బ్యాలెట్ బాక్సులు కూడా సిద్ధంగా ఉంచాం. వీటితో పాటు జంబో బ్యాలెట్ బాక్సులు కూడా ఉన్నాయి. పోలింగ్ ఆఫీసర్లు 3442 మంది, 4217మంది సిబ్బందిని వినియోగిస్తున్నాం. 648మంది మైక్రో అబ్జర్వర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. నామినేషన్ల కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పోలింగ్, కౌంటింగ్‌కు తీసుకుంటున్న చర్యలు?

కలెక్టర్: నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణతో పాటు పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రక్రియంతా సవ్యంగా జరిగేలా చర్యలు చేపట్టాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అలాగే పోలింగ్ రోజునే మధ్యాహ్నం తర్వాత కౌటింగ్ ఉంటుంది. అదేరోజు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: కులధ్రువీకరణ పత్రాలు ఎప్పుడు సమర్పించాలి? నామినేషన్ల ధరావత్‌లు ఎంత?

కలెక్టర్ : నామినేషన్లపత్రాలతో పాటే కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఇక సర్పంచ్ పదవికి జనరల్ అయితే రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1000, వార్డు పదవికి జనరల్ రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.250 చెల్లించాలి. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ అభ్యర్థి ఎన్నికల నియమావళి ప్రకారం ఖర్చుచేయాలి. 5వేలపై జనాభా ఉన్న సర్పంచ్ అభ్యర్థికి రూ.2,50,000, వార్డుకు రూ.50వేలు, 5వేల జనాభలోపు ఉన్న పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ.1,50,000, వార్డు అభ్యర్థి రూ.30వేలు ఖర్చుచేసే అవకాశం ఉంది. ఎన్నికల నియమావళి ప్రకారం మండల, గ్రామస్థాయిలో వ్యయపరిశీలన కమిటీలు ఉంటాయి. ఎవరైనా ఓటర్లకు ప్రలోభాలు గురిచేస్తే చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: పోటీకి ముగ్గురు పిల్లల నిబంధన సడలింపు జరిగిందా?

కలెక్టర్: ముగ్గురు పిల్లలున్నవారు కూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. తాజాగా ఎన్నికల నియమావళిలో మార్పుచేశారు. అలాగే నామినేషన్లలో శిక్షకు గురైనవారు, బుద్ధి మాంద్యం, డిఫాల్టర్లు, పోటీచేయడానికి అనర్హులు.